కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

రేగొండ: చేప పిల్లలను చెరువులో వదులుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- మత్స్యకారులకు చేపపిల్లలు, లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

రేగొండ, అక్టోబరు 27: రాష్ట్రంలో పారదర్శక ప్రజాపాలన సాగుతున్నదని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని చౌటకుంటలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మత్స్యకారులకు చేపపిల్లలు పంపిణీ చేశారు. అనంతరం రైతు వేదికలో 41మంది లబ్ధిదారులకు రూ.10.39లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, ఎలాంటి అవినీతి, అక్రమాలకు తావు లేకుండా కాంట్రాక్టర్ల ప్రమేయం లేకుండానే నేరుగా మత్స్యకార్మికులకు చేపపిల్లలు పంపిణీ చేసినట్లు తెలిపారు. జిల్లాలో 18లక్షల చేపపిల్లలు అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటి వరకు 50శాతం పూర్తి అయిందన్నారు. కార్మికులకే చేపలు పట్టుకొనే హక్కు కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించిందన్నారు. సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా నిరుపేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి అవినాశ్, మార్కెట్ కమిటీ చైర్మన్ గుంటోజు కిష్టయ్య, పార్టీ జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

నిరుపేదలకు వరం 'సీఎంఆర్ఎఫ్'

భూపాలపల్లి రూరల్: నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఆసరాగా నిలుస్తున్నదని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని మంజూరు నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని భూపాలపల్లి, గణపురం, చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే రూ. 25.68 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేటు, కార్పొరేట్ దవాఖానల్లో ఖరీదైన వైద్య చికిత్స చేసుకోలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ఎన్నో కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఆసరాగా నిలుస్తుందన్నారు. భూపాలపల్లి మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి ప్రైవేట్ కార్మికులకు దసరా బోనస్‌గా రూ.5వేలు ఇచ్చిన సందర్భంగా భూపాలపల్లి ఓసీ–3లో పనిచేస్తున్న సింగరేణి ప్రైవేట్ కార్మికులు ఆదివారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సత్యనారాయణరావును మర్యాదపూర్వకంగా కలిశారు. కృతజ్ఞతలు తెలిపి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, క్యాకర్తలు పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

నల్లాలు రావడం లేదని ఖాళీ బిందెలతో మహిళల నిరసన

ములుగురూరల్, అక్టోబర్ 27: ములుగు మండలంలోని బండారుపల్లి మహాత్మాగాంధీ కాలనీలో నల్లాలు రావడం లేదని మహిళలు రోడ్డుపై ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 10 రోజులుగా మిషన్ భగీరథ నల్లాలు రావడం లేదని, పంచాయతీ కార్యదర్శికి పలు మార్లు చెప్పినా పట్టించుకోలేదని, దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. చేతి పంపు మరమ్మతులకు గురై మూడు నెలలు అవుతున్నదని, ఈ విషయాన్ని సైతం జీపీ కార్యదర్శికి తెలిపినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమ కాలనీలో నీటి సమస్య లేకుండా చూడాలని వారు కోరారు. ఈ విషయమై జీపీ కార్యదర్శిని వివరణ కోరగా.. వాల్ మరమ్మతులకు గురై నల్లాలు రాలేదని, ఆదివారం సాయంత్రం వాల్‌ను అమర్చి నీటిని కాలనీకి సరఫరా చేశామని పేర్కొన్నారు.

లక్ష్మీ(మేడిగడ్డ)బరాజ్‌కు కొనసాగుతున్న వరద

మహాదేవపూర్, అక్టోబర్ 27: కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలో లక్ష్మీ (మేడిగడ్డ)బరాజ్‌కు వరద ప్రవాహం కొనసాగుతోంది. ఆదివారం ఇన్‌ఫ్లో 90,340 క్యూసెక్కులు రాగా, బరాజ్ మొత్తం 85 గేట్లు ఎత్తి అంతే మొత్తంలో నీటిని దిగువకు విడుదల చేస్తు న్నారు. ప్రస్తుతం వరద ప్రవాహం రివర్ బెడ్ నుంచి సముద్ర మట్టానికి 90 మీటర్ల ఎత్తులో ఉన్నది. వరద ప్రవాహం తగ్గే అవకాశమున్నదని భారీ నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు.

టీసీఐవీ జిల్లా అధ్యక్షుడిగా నరేందర్

చిట్యాల, అక్టోబర్ 27: తెలంగాణ చేనేత ఐక్య వేదిక(టీసీఐవీ) జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడిగా కట్కూరి నరేందర్‌ను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రానికి చెందిన నరేందర్ చిట్యాల మండల పద్మశాలీ సంఘం అధ్యక్షుడిగా, చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కమిటీ సభ్యుడిగా పనిచేసి సంఘం పటిష్టతకు పాటుపడ్డారని తెలిపారు. ఈ క్రమంలో జిల్లా అధ్యక్షుడిగా నియామక పత్రం అందజేసినట్లు పేర్కొన్నారు. తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్షుడిగా పదవి అప్పగించినందుకు శక్తి వంచన లేకుండా సంఘం పటిష్టత, సంక్షేమం కోసం పాటు పడతానని, తనకు సహకరించిన సంఘం నాయకులు, రాష్ట్ర కమిటీకి నరేందర్ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతి ఇల్లు సర్వే చేయాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ

టీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

కృష్ణకాలనీ, అక్టోబర్ 27: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో త్వరలో చేపట్టనున్న సామాజిక ఆర్థిక సర్వేలో ప్రతి ఇంటిని సర్వే చేయాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. ఆదివారం రెవెన్యూ, పంచాయతీరాజ్, సంక్షేమ, ప్రణాళిక, డీఆర్డీవో, మున్సిపల్ శాఖల అధికారులతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. సర్వే ప్రక్రియ నిర్వహణకు 933 ఎన్యూమరేటర్లు అవసరమున్నదని, 10 మంది ఎన్యూమరేటర్ల పర్యవేక్షణకు ఒక మండల స్థాయి అధికారిని పర్యవేక్షణ అధికారిగా నియమించనున్నట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ, డీఆర్డీఏ సిబ్బంది, ఎన్యూమరేటర్లుగా నియమిస్తామన్నారు. జిల్లాస్థాయిలో నిర్వహించే శిక్షణ కార్యక్రమంలో ట్రైనర్లు పాల్గొని తదుపరి మండల స్థాయిలో సర్వే టీంలకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సర్వే ప్రక్రియను పర్యవేక్షించాలని, సోమవారం ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు నియామక ఉత్తర్వులు జారీ చేస్తామన్నారు. ప్రతి రోజు సర్వే వివరాలను డేటా ఎంట్రీ పూర్తి చేయాలని, ఎలాంటి తప్పులకు తావు లేకుండా సిబ్బందిని నియమించి శిక్షణ ఇవ్వాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో సిబ్బందిని ఎంపిక చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, సీపీవో నారాయణరావు, డీఆర్డీవో అవినాశ్, సీపీవో బాబురావు, సంక్షేమ అధికారి చిన్నయ్య, ఆర్డీవో మంగీలాల్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

ఘనంగా మాలమహానాడు ఆవిర్భావ వేడుకలు

ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న నాయకులు

ఏటూరునాగారం, అక్టోబర్ 27: మండల కేంద్రంలో ఆదివారం తెలంగాణ మాలమహానాడు 18వ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మాదరి మధు అధ్యక్షతన నిర్వహించిన వేడుకలకు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంపల శివకుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు కాళేశ్వరం ప్రకాశంకు నివాళులర్పించారు. అనంతరం సంఘం జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. దళితుల ఐక్యత, రాజ్యాంగ రక్షణ, మాలల అస్తిత్వమే లక్ష్యంగా బుద్ధుడు, పూలే, అంబేద్కర్ వంటి మహనీయుల సిద్ధాంతాలను గ్రామాల్లోకి తీసుకెళ్లాలన్నారు. మంద కృష్ణ మాదిగ మాలలపై విషం చిమ్ముతూ మనవాదులు అంటూ వర్గీకరణకు అనుకూలంగా మోదీతో చేయి కలిపి దళితులను విడదీసే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. తిప్పి కొట్టేందుకు దళితులంతా ఏకమై రాజ్యాధికారం వైపున అడుగులు వేయాలనే ఉద్దేశంతో మహా పాదయాత్ర చేపట్టామన్నారు. అనంతరం కేక్ కట్ చేసి పంచారు. వేడుకల్లో మహానాడు జాతీయ మహిళా కార్యదర్శి వేల్పుల సమ్మక్క, ఐక్యవేదిక జిల్లా కోకన్వీనర్ కాళ్ల రామకృష్ణ, ఉద్యోగుల సంఘం నాయకులు జీ నర్సయ్య, సీ కిరణ్, ఎన్ చందు, సీ చంద్రబాబు, రాష్ట్ర నాయకులు పీ సమ్మయ్య, ఎం చంద్రమౌళి, జిల్లా నాయకులు బీ సారయ్య, రామకృష్ణ, డీ కృష్ణ, బీ రామకృష్ణ, పీ భిక్షపతి, ఎం రాంబాబు, ఎన్ ప్రశాంత్, హరీశ్, నరేశ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయం విచారకరం: టీఎస్ యూటీఎఫ్

కృష్ణకాలనీ, అక్టోబర్ 27: ఐదు వాయిదాల కరువు భత్యం(డీఏ) పెండింగ్‌లో ఉండగా రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం ఒక వాయిదాను మాత్రమే విడుదల చేయడం విచారకరమని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నక్క తిరుపతి, శనిగరపు రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 15 రోజుల్లో బకాయి పడిన మూడు వాయిదాల డీఏను విడుదల చేస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్నారని, అధికారంలోకి వచ్చిన తర్వాత 10 నెలలుగా ఓపిక పట్టామన్నారు. మరో రెండు వాయిదాలు బకాయి పడడంతో ఉద్యోగుల్లో ఆందోళన మొదలైందని, రాష్ట్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునఃసమీక్షించుకోవాలని కోరారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం

ఎస్సై అశోక్‌ను సన్మానిస్తున్న షాపుల యజమానులు

గణపురం, అక్టోబర్27: గ్రామాల్లో నేరాలను నియంత్రించడానికి ప్రధాన కూడలీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటులో భాగంగా మండల కేంద్రంలోని ఐరన్ హార్డ్‌వేర్, ఫర్టిలైజర్ షాప్ అసోసియేషన్, దుకాణాల యజమానులు రూ 60 వేల ఆర్థిక సాయాన్ని ఎస్సై రేఖాఅశోక్‌కు ఆదివారం అందజేశారు. అనంతరం ఎస్సైని శాలువాతో సన్మానించారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం అందించిన వారిని ఎస్సై అశోక్ అభినందించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ కటుకూరి శ్రీనివాస్, ఆవుల కిరణ్ పటేల్, దేసు ప్రదీప్, దూడే తిరుపతి, ప్రవీణ్ కుమార్, తిప్పని వృశాల్ పాల్గొన్నారు.

యాదవ సంఘం కమిటీ ఎన్నిక

ఎన్నికైన యాదవ సంఘం కమిటీ సభ్యులు

కాటారం, అక్టోబర్ 27: మండలంలోని శంకరంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఆదివారం సంఘం డివిజన్ నాయకులు గడ్డం చంద్రయ్య, అబ్బినవేన ఐలయ్య, తొట్ల శ్రీశైలం, గడవేన దేవేందర్ ఆధ్వర్యంలో అఖిలభారత యాదవ మహాసభ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా జాగరి ఓదేలు, అధ్యక్షుడిగా జాగరి వెంకటస్వామి, ఉపాధ్యక్షులుగా పర్వవేన ఓదేలు, గెల్లు రాజు, జాగరి మహేశ్, ప్రధాన కార్యదర్శిగా జాగరి సమ్మయ్య, కోశాధికారిగా మాదరబోయిన కుమారస్వామి, ముఖ్య సలహాదారుగా జాగరి రాజయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాజయ్య, శ్రీశైలం, శ్రావణ్, శేఖర్, మహేశ్, రంజిత్, దేవేందర్, నర్సయ్య, దుర్గయ్య పాల్గొన్నారు.

టిప్పర్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

ఎన్నికైన అసోసియేషన్ కమిటీ సభ్యులు

గణపురం, అక్టోబర్ 27: మండలంలోని చెల్పూర్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో టిప్పర్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా దుగ్గిశెట్టి హరికృష్ణ, ఊర నవీన్‌రావు, అధ్యక్షుడిగా జక్కం భద్రయ్య, ప్రధాన కార్యదర్శిగా పొనగంటి సతీశ్, ఉపాధ్యక్షుడిగా దొంగల నవీన్‌రెడ్డి, కోశాధికారిగా వీరమనేని రాజేశ్వరరావు, సంయుక్త కార్యదర్శిగా కోరే మహేందర్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జక్కం భద్రయ్య మాట్లాడుతూ.. అసోసియేషన్ అభివృద్ధికి అందరినీ కలుపుకొని పోతూ అహర్నిశలు కృషి చేస్తానన్నారు.

బైక్ పై నుంచి పడి వృద్ధురాలి మృతి

ఏటూరునాగారం, అక్టోబర్ 27: మండలంలోని చిన్నబోయినపల్లి– తాడ్వాయి మధ్యలో బైక్‌పై వెళ్తున్న వృద్ధురాలు ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందినట్లు ఎస్సై తాజుద్దీన్ ఆదివారం తెలిపారు. పెద్దపల్లి జిల్లా మంథని మండలం పోతారం గ్రామానికి చెందిన గిరిగుల బీమక్క(70)తన మనుమడు ప్రవీణ్‌తో కలిసి బైక్‌పై మంగపేట మండలం కమలాపురంలో బంధువుల ఇంటికి శుభకార్యానికి వస్తున్నారు. చిన్నబోయినపల్లి సమీపంలో రోడ్డుపై ఉన్న గుంతల్లో బైక్ అదుపు తప్పింది. బీమక్క కింద పడిపోవడంతో తలకు బలమైన గాయమై అపస్మారక స్థితిలోకి వెళ్లింది. స్థానికులు వెంటనే మండల కేంద్రంలోని సామాజిక వైద్యశాలకు తరలించగా, వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్య, వైద్యం అందించాలి

గణపురం, అక్టోబర్ 27: బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఉచిత వైద్యం, విద్య అందించాలని ధర్మసమాజ్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కండె రవి, జిల్లా ఉపాధ్యక్షుడు కోగిల జితేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం గణపురంలో పార్టీ కార్యకర్తల మహా సమ్మేళనం కరపత్రాలను మండల కన్వీనర్ కుర్రి స్వామినాథన్ ఆధ్వర్యంలో ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రంలో 90 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్య, వైద్యం, భూమి, ఇల్లు, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ఈ అంశాలపై పార్టీ ధర్మయుద్ధం చేయబోతున్నదని, నవంబర్ 3న హైదరాబాద్‌లో జరిగే పార్టీ కార్యకర్తల మహా సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గాంధీనగర్ గ్రామ అధ్యక్షుడు ఇంజపెల్లి విక్రమ్, సాగర్ పాల్గొన్నారు.

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

బీఆర్ఎస్ పార్టీ ఫ్లెక్సీలు చింపిన గుర్తు తెలియని వ్యక్తులు

కృష్ణకాలనీ, అక్టోబర్ 27: భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 12, 13 వార్డులైన ఖాసీంపల్లిలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ ఫ్లెక్సీలను గుర్తుతెలియని వ్యక్తులు చింపివేశారు. విజయదశమి పర్వదినం సందర్భంగా పార్టీ 13వ వార్డు యూత్ అధ్యక్షుడు జోరు రాజ్‌కుమార్ పార్టీకి చెందిన అభిమానులు నాయకులు, యూత్ నాయకుల ఫొటోలతో ఖాశీంపల్లిలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. కొందరు గుర్తుతెలియని వ్యక్తులు కావాలనే తమ ఫ్లెక్సీలను చింపివేశారని, బీఆర్ఎస్ అంటే గిట్టని వ్యక్తులే ఇలా చేశారని, వారిని గుర్తించి, కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మున్ముందు కూడా బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఫ్లెక్సీలను చింపివేయకుండా తగు చర్యలు తీసుకోవాలని పార్టీ 13వ వార్డు యూత్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ ఆదివారం భూపాలపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

గుర్తుతెలియని వ్యక్తులు చింపిన బీఆర్ఎస్ పార్టీ ఫ్లెక్సీ

తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న సంఘం నాయకులు

మల్హర్, అక్టోబర్ 27: తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం టీయూఎఫ్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ పిలుపుమేరకు మండల కేంద్రం తాడిచెర్లలో ఫోరం మండల అధ్యక్షుడు బూడిద సతీశ్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి నెరవేర్చాలన్నారు. ఉద్యమకారులను గుర్తించడానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి గుర్తింపు కార్డులు, పెన్షన్లు, సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని, ఇందిరమ్మ ఇండ్లలో ఉద్యమకారులకు 10శాతం వాటా కేటాయించాలన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు యాదండ్ల గట్టయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ముడతనపల్లి ప్రభాకర్, బోయిని రాజయ్య, దుబాసి పార్వతక్క, మహిళా అధ్యక్షురాలు యశోద, గడ్డం సమ్మక్క, చాంద్‌పాషా, తోకల గట్టయ్య, నాగయ్య, పురుషోత్తం, భీమయ్య ఉన్నారు.

నాలుగు ఇసుక లారీల పట్టివేత

ఏటూరునాగారం, అక్టోబర్ 27: వాజేడు మండలంలోని ఇసుక రీచ్‌ల నుంచి ఎలాంటి వే బిల్లులు లేకుండా రవాణా అవుతున్న నాలుగు లారీలను ఆదివారం పట్టుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. వాహనాల తనిఖీల్లో భాగంగా లారీలను తనిఖీ చేస్తున్న క్రమంలో వాజేడు మండలం భీమారం ఇసుక క్వారీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక లోడింగ్ చేసుకొని జిల్లా కేంద్రం వెళ్తున్నట్లు గుర్తించినట్లు ఆయన తెలిపారు. వాటిని పట్టుకొని డ్రైవర్లపై కేసు నమోదు చేసి ఇసుక లారీలను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు.

ఐకేపీ సెంటర్లు ఏర్పాటు చేయాలి

మాట్లాడుతున్న రామకృష్ణాగౌడ్

టేకుమట్ల, అక్టోబర్ 27: మండలంలో ఐకేపీ సెంటర్లను వెంటనే ఏర్పాటు చేసి సకాలంలో ధాన్యం కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ కార్మికశాఖ మండల అధ్యక్షుడు నేలల రామకృష్ణాగౌడ్ అన్నారు. ఆదివారం టేకుమట్లలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని టేకుమట్ల, పంగిడిపల్లి, వెల్లంపల్లి, బూర్నపల్లి గ్రామాల్లో రైతు వేదికలు ఉన్నాయని, వీటి పరిధిలోని గ్రామాల రైతులు నేటికీ 20% వరి పంట కోశారన్నారు. కానీ అధికారులు ఐకేపీ సెంటర్లు ఏర్పాటు చేయలేదని, దీంతో అకాల వర్షాలు పడితే ధాన్యం తడిసి నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. అన్ని రకాల వరి ధాన్యానికి బోనస్ అందేలా, గన్నీ సంచుల కొరత లేకుండా, సకాలంలో ధాన్యం మిల్లలర్లకు తరలించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

టేకుమట్ల, అక్టోబర్ 27: మండలంలోని రాఘవాపూర్ గ్రామానికి చెందిన అక్కల మాదవ్ ఇటీవల మృతి చెందగా ఆదివారం దశదిన కర్మ నిర్వహించారు. టేకుమట్ల మాజీ ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి పాల్గొని మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ. 2వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల కార్యదర్శి ఆకునూరి తిరుపతి, నాయకులు కొండ్ర ఓదెలు, మూగయ్య, శంకర్, పర్లపల్లి సాంబయ్య, భద్రయ్య, వంశీకృష్ణ ఉన్నారు.

జీపీ ట్రాక్టర్ బోల్తా

మహాముత్తారం, అక్టోబర్ 27: మండలంలోని నిమ్మగూడెం పంచాయతీ ట్రాక్టర్ శనివారం మట్టి తరలిస్తూ అదుపుతప్పి బోల్తాపడింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామంలో కొందరు రైతులు ఇంటి అవసరాలకు మట్టిని ట్రాక్టర్ల ద్వారా తీసుకెళుతునారు. అదే జీపీ కారోబార్ రజినీకాంత్ జీపీ ట్రాక్టర్‌తో రాత్రిపూట మట్టిని తీసుకొచ్చేందుకు వెళ్లగా బోల్తా పడడంతో ఇంజిన్ ధ్వంసమైంది. జీపీ ట్రాక్టర్‌ను రాత్రి సమయంలో మట్టికి ఎలా తీసుకువెళ్లావని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఇదే విషయమై కార్యదర్శిని సంప్రదించగా.. 'నేను లీవ్‌లో ఉన్నానని, అది ఎలా జరిగిందో తెలుసుకుంటానని' తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★హైదరాబాద్ & తెలంగాణ జిల్లాల్లోని ప్రముఖ టెలికాం టవర్ కంపెనీలో పనిచేయడానికి డిప్లొమా/ ITI చదివిన ఎలక్ట్రీషియన్లు కావలెను. ఫోన్: 9177333978.
WGL-NT-98842

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

ఏఈవోల సమస్యలు పరిష్కరించాలి

పీఏసీఎస్ మాజీ చైర్మన్ పూర్ణచంద్రారెడ్డి

గణపురం, అక్టోబర్ 27: రాష్ట్రంలోని ఏఈవోల సమస్యలు పరిష్కరించాలని, డీసీఎస్ (డిజిటల్ క్రాప్ సర్వే) పేరుతో అనేక ఇబ్బందులు పడుతున్నారని జయశంకర్ భూపాలపల్లి గండ్ర యువసేన జిల్లా అధ్యక్షుడు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పోరెడ్డి పూర్ణచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఏఈవోలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ఇప్పటికే 49 రకాల పనులు చేస్తూ (వ్యవసాయ విస్తరణ అధికారి)లు రైతులకు అందుబాటులో ఉంటున్నారు. ఏఈవోలుగా చాలా మంది మహిళలు ఉన్నారని కనీసం వారిపై కూడా సానుకూల దృక్పథం లేకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా సస్పెండ్ చేసిన 160 మందిని విధుల్లోకి తీసుకొని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. వారి సమస్యలపై ప్రభుత్వం స్పందించి, సానుకూల నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

బీఆర్ఎస్ చిట్యాల మండల సోషల్ మీడియా ఇన్‌చార్జి రాజేందర్

చిట్యాల, అక్టోబర్ 27: రైతులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులకు క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ పార్టీ చిట్యాల మండల సోషల్ మీడియా ఇన్‌చార్జి కట్కూరి రాజేందర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రైతులకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నట్టేట ముంచిందన్నారు. ఇప్పటి వరకు రైతులకు రుణమాఫీ జరగక ఇబ్బంది పడుతున్నారని, యాసంగి, వానకాలం పంటలకు రైతు భరోసా ఇవ్వలేదని, వరి పంటకు రూ. 500 బోనస్ ఇస్తానని చెప్పి మాట తప్పిందన్నారు. మళ్లీ ఇప్పుడు సన్న వడ్లకే బోనస్ ఇస్తామని అనడం సిగ్గుచేటన్నారు. రైతులు పండించిన ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తూ, వరి, అన్ని రకాల ధాన్యానికి బోనస్ ఇవ్వాలన్నారు. 2 పంటలకు పెట్టుబడి సాయం ఎకరాకు రూ.15వేలు వెంటనే విడుదల చేసి రైతుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. మేనిఫెస్టోలో చెప్పినట్టు కౌలు రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

ఏటూరునాగారం, అక్టోబర్ 27: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన హోప్ ప్రీమియర్ లీగ్ టెన్నిస్‌బాల్ క్రికెటు టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. చివరిరోజు ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి సూర్య మాట్లాడారు. క్రీడాకారులు క్రీడలపై విశ్వాసం పెంచుకోవాలని, భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. లక్ష్యాలను సాధనలో ముందు వరుసలో ఉండాలని పిలుపునిచ్చారు. క్రీడల్లో విజేతగా నిలిచిన మురళి టీంకు షీల్డ్‌లు అందజేశారు. కార్యక్రమంలో క్రీడాకారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న సూర్య

మాధవరావుపల్లిలో బెల్ట్ షాపులను తొలగించాలి


ఫిర్యాదు చేసిన ప్రతిని చూపుతున్న కాలనీవాసులు

గణపురం, అక్టోబర్ 27: మండలంలోని చెల్పూర్ మేజర్ గ్రామపంచాయతీ పరిధి మాధవరావుపల్లి కాలనీలో విచ్చలవిడిగా బెల్ట్‌షాపుల నిర్వహణతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, మహిళలు బయటకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని, వెంటనే వాటిని తొలగించాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. ప్రతిరోజు రాత్రి, పగలు తేడా లేకుండా యథేచ్ఛగా బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయిస్తున్నారని, దీని వల్ల రోడ్లపై భారీగా వాహనాలను నిలుపుతున్నట్లు పేర్కొన్నారు. ఫలితంగా తమ అవసరాలకు బయటకి వెళ్లకుండా తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నామని, వెంటనే బెల్ట్ షాపులను తొలగించాలని ఎస్పీ, ఎక్సైజ్ అధికారులకు కూడా ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు బెల్ట్ షాపులను తొలగించి, తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

ప్రమాదాలు నివారించాలని ఎర్రమ్మకు పూజలు

ఏటూరునాగారం, అక్టోబర్ 27: నిత్యం జరుగుతున్న ప్రమాదాలను నివారించాలని ఆదివారం ఎర్రమ్మ దేవతకు స్థానిక ప్రజలు పూజలు చేశారు. మండల కేంద్రంలోని వైజంక్షన్ సమీపంలో ఎర్రమ్మ దేవతకు ఏటా పూజలు చేసి, మొక్కులు తీర్చడం ఆనవాయితీగా వస్తున్నది. ఆలయ కమిటీ చైర్మన్ వంగూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో అర్చకుడు సూర్యనారాయణ శర్మ ఎర్రమ్మ తల్లికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఎర్రమ్మకు చీరసారెలు సమర్పించి అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని వేడుకున్నారు. పూజల్లో సాయిబాబా ఆలయ చైర్మన్ పెండ్యాల ప్రభాకర్, ఆలయ కమిటీ సభ్యులు వలస శ్రీనివాస్, రంగయ్య, నర్సయ్య, కోటయ్య, అశోక్, రవీందర్, వెంకన్న, ఇరుసవడ్ల భిక్షపతి, ముత్తయ్య, తిరుపతి, విష్ణు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

ములుగురూరల్, అక్టోబర్ 27: ములుగు జిల్లా కేంద్రంలోని గడిగడ్డలో ఉన్న ఎస్టీ బాలికల హాస్టల్ విద్యార్థినులకు ఆదివారం కేఎస్ఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ కోలా సందీప్ మాట్లాడుతూ.. చలికాలం దృష్ట్యా విద్యార్థులకు తన వంతు సాయంగా దుప్పట్లు, బిస్కెట్లు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దుర్గం రమణయ్య, కోగిల మహేశ్, బైకాని సాగర్, అంజన్ రావు, ఖాసీం, శీలం మధు ఉన్నారు.

ముళ్ల చెట్ల తొలగింపు

మొగుళ్ళపల్లి, అక్టోబర్ 27: మండల కేంద్రంలోని పెద్దమ్మ చెరువు కట్టపై ఉన్న ముళ్ల చెట్లను కాంగ్రెస్ జిల్లా నాయకుడు ఎర్రబెల్లి పున్నం చందర్‌రావు సొంత ఖర్చులతో ఆదివారం తొలగింపజేశారు. కట్టపై ముళ్ల పొదలు ఏపుగా పెరిగి రైతులు వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతుండడంతో గమనించి జేసీబీ సహాయంలో ముళ్ల పొదలను తొలగించాడు.

సెల్ ఫోన్ అప్పగింత

కాటారం, అక్టోబర్ 27: వీరాపూర్ గ్రామానికి చెందిన గుంటి కుమార్ ఇటీవల ఫోన్ పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్(సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్ రికవరీ చేసి బాధితుడికి ఆదివారం అందించినట్లు ఎస్సై అభినవ్ తెలిపారు.

హెడ్ కానిస్టేబుల్‌కు ఆత్మీయ సన్మానం

శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ఎస్సై, కానిస్టేబుళ్లు

కాటారం, అక్టోబర్ 27: కాటారం పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ ఇటీవల రామగుండం కమిషనరేట్‌కు బదిలీ అయిన హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్‌కు ఆదివారం వీడ్కోలు సన్మానం చేశారు. ఎస్సై అభినవ్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది హెచ్‌సీ శ్రీనివాస్‌ను పూలమాలలు, శాలువాలతో సన్మానించి బహుమతి అందించారు. విధి నిర్వహణలో సహకరించిన పోలీస్ అధికారులు, తోటి సిబ్బంది, ప్రజలకు శ్రీనివాస్ ధన్యవాదాలు తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు

దంపతులకు తీవ్ర గాయాలు

గణపురం, అక్టోబర్ 27: బైక్‌ను కారు ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గణపురానికి చెందిన దంపతులు చిలుమోజు భరత్, లాస్యా బైక్‌పై గాంధీనగర్‌కు వెళ్తున్న క్రమంలో, చిట్యాల మండలం చల్లగరిగెకు చెందిన బండి సంజయ్ మండల కేంద్రంలో జరిగిన ఓ ఫంక్షన్ కు హాజరై తిరిగి వెళ్తూ ఆంధ్రా బ్యాంకు సమీపంలో వెనుక నుంచి బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో దంపతులు ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు వెంటనే 108 వాహనంలో భూపాలపల్లి జిల్లా దవాఖానకు తరలించారు. లాస్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. కాగా, కారులో ఉన్న వ్యక్తి మద్యం తాగి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మితిమీరిన వేగమే ఈ ప్రమాదానికి కారణమని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.